శ్రీరంజని ఆ ఇరుకు మార్కెట్ వీధిలో నుంచి జనప్రవాహాన్ని తప్పించుకొంటూ వేగంగా నడుస్తోంది. ఇంకా పూర్తిగా చీకటిపడలేదుగానీ, అప్పుడప్పుడే మసక చీకట్లు అల్లుకొంటున్నాయ్. ఇంకో ఫర్లాంగు దూరముంటుంది తులసి

# అదృష్టం

## శీలంశెట్టి రమాదేవి



ఇల్లు అంతకు కొద్దిసేపటి ముందే జరిగిన తన పెళ్ళిచూపుల విశేషాలన్నీ తులసికి తెలియజేయాలన్న ఆత్రతే, చీకటిపడుతున్నా ఆమె ఇంటికి బయల్దేర తీసింది. ఇప్పుడే కాదు. ఎప్పుడే విశేషం జరిగినా వెంటనే ఆ విషయం తులసికి తెలియజేయాల్సిందే. తన ప్రాణ స్నేహితురాలది అదీగాక తన పెళ్ళిచూపులకీ,తులసికీ పరోక్షంగా సంబంధం ఉంది. తన కసలు పెళ్ళిచూపులంటేనే అసహ్యం పెళ్ళిచూపులను కేవలం ఆడపిల్లలను అవమానపరిచే కార్యక్రమంగా భావిస్తుంది తను అందుచేతే తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలు చూడబోతోంటే గట్టిగా హెచ్చరించింది,పెళ్ళిచూపులుండడానికి వీల్లేదని. ఆ నిబంధన వినడంతోనే రెండు మూడు సంబంధాలు వెనక్కు పోయాయ్. ఇలా లాభం లేదని తన ఫొటో పంపే ఏర్పాట్లు చేశారు తల్లి

దంప్రతులు. అది కూడా ఏమంత ఉపయోగకారిగా కనిపించలేదు. ఈ లెఖ్ఖలో తన కసలు వివాహమే కాదేమో నన్న భయం పట్టుకుంది వాళ్ళకు పెళ్ళి చూపులకు ఒప్పుకోమని ఆమెని వత్తిడి చేయసాగారు. కొద్దిరోజులు ససేమిరా ఒప్పుకోనని తలాయించింది శ్రీరంజని. చివరకు తన స్నేహితురాలయిన తులసితో ఈ విషయాలన్నీ చెప్పి వ్యాకులపడుతోంటే తులసి ఓ సలహా ఇచ్చింది.

"పోనీ ఓ పని చేయవే! పెళ్ళి చూపులు ఏర్పాటుచేయనీ! కానీ పాత పద్ధతిలో కాదు. మీ ఇంట్లో ఓ గదిలో అతనూ, నువ్వూ ఇద్దరే కూర్చుని, పరిచయం చేసుకొని నిర్మొగమాటంగా అన్నివిషయాలూ మాట్లాడుకుంటారు. మీ వాళ్ళంతా బయట కూర్చుంటారు. ఆ తరువాత మీ ఇద్దరికీ ఇష్టమయితే వివాహం జరుగుతుంది లేకపోతే గుడ్‌బై కొట్టేస్తారు. ఎలా వుంది?"

అందులో అభ్యంతరకరమయిన విషయమేమీ కనిపించలేదు శ్రీరంజనికి. ఈపద్ధతిలో తను ఓముద్దాయిలా అతగాడి కెదురుగ్గా తల వంచుకు కూర్చోవడం, అతని ప్రశ్నలకూ, అతని తరఫున వెంచేసే బంధు మిత్రుల ప్రశ్నలకూ సమాధానం చెప్పాల్సిన దౌర్భాగ్యపు స్థితి ఉండదు. అందుకే అంగీకరించింది శ్రీరంజని. అంగీకరించిన పదిరోజులకే ఇవాళ ఆ రకం పెళ్ళిచూపులు ఏర్పాటయినాయ్. ఆ పెళ్ళిచూపుల విశేషాలు చెప్పడానికే తులసి దగ్గర కెళ్తోంట. మరి అలాంటి ఆలోచన అందజేసిన ఘనత ఆమె దేగా.

శ్రీరంజని తక్కున నిలబడిపోయింది. రోడ్డు మధ్యలో రెండు రిక్షాలు ఎదురెదురుగా నిలబడిపోయినయ్. నువ్వు తప్పుకోమంటే నువ్వే వెనక్కి పొమ్మంటూ ఇద్దరూ వివాదంలోకి దిగేరు. ఆ రిక్షాల వెనుక కార్లు స్కూటర్లు, జనం అన్నీ త్రోవలేక నిలబడిపోయినయ్. ఒకటే కేకలు గొడవ. అంతా నిలబడి చూస్తున్నారు. దూరంగా పోలీసుల విజిల్స్ వినబడుతున్నయ్.

శ్రీరంజని విసుగ్గా గడియారం వంక చూసుకొంది ఆరున్నరయిపోయింది టైము. తులసిదగ్గర కెళ్ళామా, వద్దా అని ఓ క్షణం ఆలోచించిందామె ఈ రద్దీ అంతా తొలగి వాళ్ళిల్లు చేరుకునేసరికి టైము ఏడయిపోతుందేమో! తులసితో ఓ గంటయినా గడపాల్సిందే. అప్పుడు తనిల్లు చేరుకొనేసరికి ఎనిమిదిన్నర— అంత రాత్రివేళ వెళ్ళడానికి తనకేమీ భయంలేదు. కాని తల్లిదండ్రులు గొడవ చేస్తారు. ఇవంతా నిజమేగాని పెళ్ళి చూపుల తమాషా తులసికి వెంటనే చెప్పాలని ఉంది తనకు. తను చెప్తోంటే తులసి ఎంతగా నవ్వేస్తుందో. తులసి

నవ్వుతూంటే తనకి ఆనందంగా ఉంటుంది.

శ్రీరంజనికి మళ్ళీ ఓసారి ఆ మధ్యాహ్నం జరిగిన పెళ్ళిచూపుల దృశ్యమంతా కళ్ళముందు కదిలింది. నవ్వూ, సిగ్గూ రెండూ కదలించివేసి నయ్యామెని. అతనూ తనూ-ఇద్దరే మిగిలారు తమ హాలు పక్క గదిలో. తన తల్లిదండ్రులు, అతనితో వచ్చిన ఆడాళ్ళు అందరూ తమని ఒంటరిగా వదలి హాల్లో కెళ్ళిపోయారు.

తను తలెత్తి ధైర్యంగా అతనివంక చూసింది. సరిగ్గా అదే సమయంలో అతనూ తనవంక చూశాడు. తనకి సిగ్గు ముంచుకొచ్చింది కాని అదేమీ అతనికి తెలీకూడదని—వేరే దిక్కు చూపులు మళ్ళించుకొంది.

అతని రూపం బాగానే ఉంది. చామన ఛాయ మంచి పర్సనాలిటీ. గొప్ప అందగాడు కాదు గానీ అందవిహీనుడు మాత్రం కాదు.

"మీ పేరేమిటి ?" అడిగాడతను. అతని గొంతు వినడానికి సొంపుగానే ఉంది.

"శ్రీరంజని..." అతని వంక చూస్తూ జవాబిచ్చింది తను.

"నా పేరు వినోద్..." చిన్నగా నవ్వుతూ అన్నాడతను.

తను మందహాసంచేసి ఊరుకొంది.

"నా గురించి ఏమేనా తెలుసుకోవాలనుంటే అడగండి, చెప్తాను..." మళ్ళీ నవ్వుతూ అన్నాడతను.

నిజానికి అతని గురించి అన్నీ తెలుసుకోవాలనుంది తనకి అతని చదువూ, అతని ఉద్యోగం, అతని హాబీలూ-గేమ్స్ మీద ఆసక్తి-స్నేహితులూ, స్నేహితురాండ్రూ, ఉమన్స్‌లిబ్ గురించిన అభిప్రాయలూ-ఒకటేమిటి ఎన్నో విషయాలు. కానీ అవన్నీ ఎలా అడగడం ?

"అడగడానికిసందేహిస్తున్నట్లున్నారు పోనీ నేనే చెప్తాను నా గురించి. మా ఊళ్ళోని హిందూ కాలేజిలో డిగ్రీ తీసుకొన్నాను. తీసుకొన్న రెండేళ్ళకి ఎల్.ఐ సి.లో ఈ ఉద్యోగం దొరికింది. నాకు అవసరమయిన దానికంటే ఎక్కువ జీతమే దొరుకుతుంది. అంచేతనాక్కాబోయే భార్యని సుఖపెట్టగలనన్న నమ్మకం నాకుంది ఇకపోతే నాకూ సాహిత్యానికి చాలా దూరం నవలలు గానీ, కథల పుస్తకాలు గానీ, ఇతర మాగజైన్లు కానీ చస్తే చదవను. ఓ వేళ ఎప్పుడయినా అవి చేతికి దొరికితే వాటిల్లో ఎక్కడయినా కార్టూన్స్ కనబడితే చూస్తాను, అంతే. గేమ్స్ అంటే నాకు ప్రాణం. హాకీ, వాలీబాల్ రెండూ నా కిష్టమైనవి. ఆ రెండిట్లోనూ మా కాలేజీని రిప్రజెంట్ చేశాను. ఇవి చాలకపోతే మీరు ఇంకేమయినా అడగండి, చెప్తాను." తనకి నవ్వొచ్చింది. ఏమిటి, ఇలా అప్ప

జెప్పడానికా ఇంత దూరం వచ్చింది ? దీనికి బదులు ఫొటో పంపి అదంతా ఓ కాగితంమీద రాస్తే సరిపోయేదిగా.

"మరి మీ గురించి ఏమీ చెప్ప రేమిటి ?" నవ్వుతూ అడిగాడతను.

"మీరు అడగండి. చెప్తాను..."

"ఆల్ రైట్. అడుగుతాను. మిగతా విషయాల్లో కెళ్ళేముందు అసలు విషయం చెప్పండి. మీకు నేను నచ్చానా ?"

తను అకస్మాత్తుగా సిగ్గుపడి పోయింది. అంతలోనే ధైర్యం తెచ్చు కొని "ఊహు, ఈ విషయం ముందు మీరే చెప్పాలి. మీకు నేను నచ్చానో లేదో..." అంది.

ఆతను నవ్వేశాడు.

"నిజం చెప్పాలంటే-నాకు ఎంతో నచ్చింది మీ రూపం. మీ అందం చాలా తక్కువమంది కుంటుంది. ఇలా అంటున్నానని నేను అందానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాననుకోకండి. కాని నాకో నమ్మకం కూడా ఉంది. సాధా రణంగా అందంగా ఉన్న అమ్మాయిల మనసు కూడా అందంగానే ఉంటుందని" శ్రీరంజని గర్వపడిపోయింది. తన అందం అతనిని ఆకట్టుకొన్నందుకు పొంగిపోయింది.

"నాక్కూడా మీరు నచ్చారు..." అనేసింది త్వరత్వరగా మాట్లాడుతూ.

"బావుంది. ఇక మిగతా విషయాల్లో కొద్దాం ! మీరు ఇంకా పైకి చదవాలను కొంటున్నారా ?" అడిగాడతను.

"అవును ! చదివి మంచి ఉద్యోగం చేయాలనుం..." ధైర్యంగా అంది శ్రీరంజని.

"ఉద్యోగమా ?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఏం ? ఆడాళ్ళు ఉద్యోగం చేయడం మీ కిష్టంలేదా ?"

"ఒకరకంగా ఇష్టంలేదనే అనాలి. అంటే నా ఉద్దేశం 'స్త్రీలందరూ' అని కాదు. భర్త ఉద్యోగస్తుడయినప్పుడు భార్య ఉద్యోగం చేయకూడదు. భార్య ఉద్యోగం చేసేట్లయితే భర్త చేయ కూడదు !"

"ఎందుకని ?" ఆశ్చర్యంగా అడిగింది.

"మనది బీద దేశం. మన దేశంలోని ముఖ్య సమస్య నిరుద్యోగం. ఉద్యోగం చేసే మగవాడిమీద పదిమంది ఆధారపడే కుటుంబాలు ఎక్కువ. ఈ పరిస్థితిలో మీరు కేవలం కాలక్షేపానికి చేసే ఉద్యోగం ఓ నిరుద్యోగికి దొరికితే పది మంది పోషింపబడతారు. ఒకకుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగాలు చేయడం కంటె, ప్రతి కుటుంబంలోనూ ఓ వ్యక్తికి ఉద్యోగం దొరికేలా చేయడం దేశానికి ఆరోగ్యం." ఆగాడతను.

శ్రీరంజనికి అతని మాటల్లో అసమంజసమేమీ కనిపించలేదు. తను

ఇంతకాలం 'స్త్రీకి ఉద్యోగమే రక్షణ' అనుకొంటూ వస్తోంది. ప్రతి స్త్రీకీ ప్రభుత్వం ఉద్యోగం ఇస్తే స్త్రీ సమస్యలు దూరమవుతాయి అని భావిస్తూ వచ్చింది. కాని ఈ విధంగా దేశాన్ని దృష్టిలో ఉంచుకొని ఎప్పుడూ ఆలోచించలేదు.

"ఈ విషయంలో మీకేమయినా అభిప్రాయ భేదముంటే చెప్పండి..." నవ్వుతూ అన్నాడతను.

"నా ఆలోచన ఇంకోరకంగా ఉండేది కాని.. ఇప్పుడు మీ మాటలే నిజమని పిస్తున్నాయ్..." ఒప్పుకొంటూ అంది.

"మీ అభిప్రాయాలను సమర్థించు కోకుండా అవతలివారి అభిప్రాయాలను తెలుసుకొని ఆలోచించి ఏది సముచితమో నిర్ణయించుకొనగల మీరంటే నాకు గౌరవం కూడా ఏర్పడింది. నాకు మీరు అన్ని విధాలా నచ్చారు. ఇంక మీ అంగీకారమే ఆలస్యం..." గంభీరంగా అన్నాడతను.

తనకు నవ్వొచ్చేసింది.

తనకు మాత్రం అంగీకారం కాక మరేమిటి? మరి కొద్దిసేపు ఇద్దరూ మరెన్నో విషయాలు ముచ్చటించు కొన్నారు ఆ తరువాత ఇద్దరూ తమ పెద్దలకు తమ అంగీకారాన్ని తెలియ జేశారు. వెంటనే మంచిరోజు చూసి ముహూర్తం కూడా నిశ్చయించేశారు పెళ్ళికి సరిగ్గా పదిరోజుల టైముంది. అంతే! ఆ తరువాత లగ్నాలు లేవుట.

ఈ విషయం విని తులసి ఎంత ఆశ్చర్యపోతుందో.

ఎదురుగా ఓ రిక్షా వేగంగా మీదకు రావడంతో పక్కకు గెంతేసింది శ్రీరంజని. ఈ ఆలోచనల్లోపడి తను పరిసరాల్ని కూడా మర్చిపోతోంది మరి కొంచెం ఉంటే ఆ రిక్షా తనకు డాష్ ఇచ్చేసేది.

సరిగ్గా అప్పుడే తన కెదురుగా వస్తున్న వ్యక్తిని చూసింది శ్రీరంజని. చూసి తృళ్ళిపడింది. ఎవరది? కృష్ణేనా? అవును! కృష్ణే! సందేహం లేదు. క్రాఫ్ కొంచెం మారింది. అబ్బ! ఇప్పుడు ఇంకెంతో అందంగా ఉన్నాడు. ఎంతకాలానికి కనబడ్డాడు? ఆతనిని మళ్ళీ ఇలా కలుసుకొనే రోజొస్తుందని తను ఎప్పుడూ అనుకోలేదు అసలతను ఎక్కడున్నాడో కూడా తెలుస్తే కదా! అతనూ తనూ అయిదేళ్ళ క్రితం గడిపిన ఆ రోజులు తను ఎలా మర్చిపోగలదు? ఎప్పటికయినా అతను తనకోసం వెతుక్కొంటూ వస్తాడనీ, అప్పుడు తామిద్దరూ ఒకటవుతారనీ కన్న కలలు ఇంకా గుర్తున్నాయ్. అవి కేవలం కలలు కావనీ, ఎప్పటికయినా నిజాలవుతాయనీ అనుకొని ఉంటే ఇవాళ ఈ పెళ్ళి సంబంధానికి తను అంగీకరించేదే కాదు. తన మనసులో ఇంకా కృష్ణే ఉన్నాడు. అతని మనసులోనూ తనే ఉంటుంది. తనకా విషయం తెలుసు. ఆ రోజు తన



తల్లీ తండ్రీ ఇంట్లోలేని సమయంలో... జరిగిన ఆ మధుర సంఘటన తనెలా మర్చిపోతుంది?

తాము వైజాగ్‌లో ఉన్నప్పుడు తమ ఇంటి పక్కనే గదిలో ఉండేవాడతను.

అప్పుడప్పుడు తండ్రిదగ్గర కొచ్చి ఏవో సలహాలడిగి పోతూండేవాడు. అప్పటికింకా అతను నిరుద్యోగే. ఆ రోజుల్లోనే అతనికి ఉద్యోగం వచ్చింది. ఆ ఆర్డర్స్ చేత్తో పట్టుకొని వెంటనే తమ ఇంటి కొచ్చేడు.

"మీ నాన్నగారు లేరా?" అనడిగాడు ఇంట్లో కొచ్చి కూర్చుంటూ.

"లేరు. అమ్మా, నాన్నా ఇద్దరూ షాపింగ్ కెళ్ళారు" అంది తను.

"ఇప్పుడే తిరిగి వస్తారా? చాలా టైం పడుతుందా?" అడిగాడు.

"ఏం? ఎందుకు?" నవ్వుతూ అడిగింది తను. అప్పటికే తన కతని మీద మనసుంది. తన నవ్వు చూసి అతను కొద్దిగా చలించటం తేలిగ్గా గ్రహించింది తను.

"నాకు ఉద్యోగం వచ్చింది ఈ విషయం చెప్పాలనీ..."

"నాకు చెప్పకూడదా ఏమిటి ఆ సంగతి-సరే నా మీద అంత అయిష్టం

ఉంటే ఉండనీండి-కాని నేను మాత్రం మీకు కంగ్రాచ్యులేషన్స్ చెప్తున్నాను..."

అతను గట్టిగా నవ్వాడు.

"అవును! మీ మీద అయిష్టం ఉండబట్టే రోజుకోసారయినా ఏదో ఒకవంకతో మీ ఇంటి కొచ్చి మీ నాన్నగారికి ఏదో ఒక అబద్ధం చెప్పి మీ దర్శనభాగ్యం కలుగజేసుకొని వెళ్తున్నాను..."

తను ఆనందంతో పులకించి పోయింది.

ఆ విషయం తనకు తెలుసు. కాని అతని నోటి వెంబడే వినాలన్న కోరిక ఇన్నాళ్ళకు తీరింది. అతనినే పెళ్ళాడి అతని సరసన జీవితం గడపాలన్న మరో కోరిక తీరే అవకాశం ఎంతో దూరంలో లేదు.

"అంతా అబద్ధం..." అంది తన ముఖంలోని ఆనందం కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తూ.

ఆ మాటకు అతను జవాబుగా ఛటక్కున లేచి తనకు దగ్గరగా వచ్చేశాడు. తను ఖంగారుపడి ఓ అడుగు వెనక్కి వేయబోయింది గానీ అప్పటికే అతని చేతుల్లో బందీ అయి పోయింది. అతని పెదాలు తన ముఖాన్నంతా స్పర్శిస్తూ వివశురాలిని చేసేస్తున్నయ్. మధురమైన అతని కౌగిలిలో తను స్పృహ కోల్పోతోంది. బయట గేటు తీసిన చప్పుడు కాగానే ఇద్దరూ కౌగిలినుండి విడివడి దూరంగా జరిగారు. తల్లీ దండ్రీ రావటం చూచి తను లోపలకు పరుగెత్తింది. అతను ఏమీ ఎరగనట్లు కుర్చీలో కూర్చుని ముఖానికి పేపరు అడ్డుపెట్టుకొని చదువుతున్నట్లు నటించసాగాడు. అంతే! ఆ తరువాత అతన్తో ఏకాంతంగా మాట్లాడటం కుదరనే లేదు. ఆ రోజు సాయంత్రమే ఉద్యోగంలో చేరడానికి హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. చాలా రోజులు అతనినుంచి ఏమయినా ఉత్తరం వస్తుందేమోనని ఎంతో ఎదురు చూసింది తను. ఈలోగా తమకి కూడా వైజాగ్‌నుంచి ట్రాన్స్‌ఫర్ అయి పోయింది అక్కడితో అతనినిక కలుసుకొనేయోగంలేదని నిరుత్సాహపడి పోయిందితను. అయిదేళ్ళ తర్వాత తిరిగి ఇలా పట్నమూ, పల్లె కాని ఈ ఊళ్ళో ఈ ఇరుకురోడ్డు మీద తిరిగి అతనిని కలుసుకోగలదని తనెలా అనుకోగలదు? అనుకొంటే ఇవాళ ఈ పెళ్ళిసంబంధానికి ఎందుకు ఒప్పుకొనేది? పెళ్ళి చూపుల్లో తనతో మాట్లాడ్డాని కొచ్చిన పెళ్ళికొడుకుతో 'మీరు నాకు నచ్చారని' ఎందుకు చెప్తుంది? రోడ్డు కిరుపక్కలా ఉన్న దుకాణాలవేపు చూస్తూ నెమ్మదిగా నడుస్తూ అతి సమీపంగా వచ్చేశాడతను. అతనే తనని చూసి పలుకరిస్తే బావుండును కాని అతను చుట్టుపక్కలున్న మనుషుల్ని గమనించేట్లు కనిపించటంలేదు. తనే




పలుకరిస్తే సరి. తప్పేముంది? అతను తనని చూస్తే-హఠాత్తుగా తన జీవితమే మారిపోవచ్చు.

"కృష్ణా !" నెమ్మదిగా పిలిచింది శ్రీరంజని.

అతను ఠక్కున నిలబడిపోయి పక్కకు చూశాడు. అతని కళ్ళల్లో మెరుపు, ముఖంలో ఆనందం, పెదాల మీద చిరునవ్వు...

"మీరు ఈ ఊళ్ళో ఉంటున్నారా?" అడిగాడతను నవ్వుతూ.

"అవును! నాన్నగారికి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి రెండేళ్ళవుతోంది... అసలు మా నేటివ్ ప్లేస్ కూడా ఇదేగా..." ఆనందంగా అంది తను.

"ఓ...మర్చిపోయా నావిషయం... అనుకోకుండా భలే కలుసుకొన్నానే మిమ్మల్ని..."

"మనం ఎప్పటికయినా కలుసుకోగలమన్న నమ్మకం పోయింది నాక్కూడా" అంది శ్రీరంజని.

"ఆ...అవును..." పొడిగా అన్నాడతను.

"పదండి! అలా హోటల్లో కూర్చుని మాట్లాడుకొందాం..." ధైర్యంచేసి అంది శ్రీరంజని.

"ఓ! అలాగే..."

ఆమెతోపాటు రోడ్డు పక్కనే ఉన్న హోటల్లోకి దారితీస్తూ అన్నాడతను.

ఇద్దరూ 'ఫామిలీరూమ్'అన్న గదిలో కెళ్ళి కూర్చున్నారు. అతనోసారి శ్రీరంజని ముఖంలోకి చూసి నవ్వాడు. సిగ్గుపడింది శ్రీరంజని. అతని మనసులో తనే ఉందింకా. అందుకే పాత జ్ఞాపకాలన్నీ పైకి వచ్చేట్లుగా అలా

నవ్వాడు. ఒకవేళ అదే నిజమయితే... ఇప్పటికీ తామిద్దరూ ఒకటయే అవకాశా లున్నాయ్. ఉదయం నిశ్చయమయిన పెళ్ళిసంబంధం కాదనడానికి ఎంతో సేపు పట్టదు.

ఆ ముహూర్తానికే కృష్ణతో వివాహం జరగడం అసంభవం కూడా కాదు. తన తల్లిదండ్రులకూ కూడా అభ్యంతరం ఉండదు. నిజంగా అలా జరిగితే తనెంత అదృష్టవంతురాలవుతుంది. మనస్ఫూర్తిగా కోరుకొనే మొగాడు భర్తగా ఎంతమందికి లభిస్తాడు?

ఆ మధ్యాహ్నం తనతో ఎంతో సేపు మాట్లాడిన పెళ్ళికొడుకు గుర్తుకొచ్చాడు శ్రీరంజనికి అతనూ బాగానే ఉన్నాడు. ఆకర్షణీయంగానే ఉన్నాడు. తనని ఇంచుమించుగా మొదటి చూపులోనే ప్రేమించాడు. తననే చేసుకోవాలన్న నిర్ణయాని కొచ్చేశాడు. అయినా... కృష్ణా తనూ ఏనాడో ప్రేమించుకొన్నారు. ఉద్యోగం అతనిని అలా అకస్మాత్తుగా దూరంచేయకపోతే ఒకటయి ఉండేవారే ఈపాటికి ఊహూ! ఇప్పుడిక తనుఅతనిని వదులుకోలేదు. అతను తననెంతగా ఆరాధిస్తున్నాడో—ఆ రోజు జరిగిన సంఘటనే చెప్తుంది...

స్వీటూ, బూందీ, కాఫీ ఆర్డర్ చేశాడు కృష్ణ. ఇద్దరూ నెమ్మదిగా తినసాగారు.

"మీరు ఇన్నేళ్ళల్లో కనీసం ఒక్కసారయినా మా ఇంటికి రాలేదేం? తలచుకొంటే కష్టమేం కాదుగా! నాన్న గారి పేరుచెప్తే ఆ డిపార్ట్ మెంట్ వారెవరయినా తేలిగ్గా చెప్పేస్తారు—ప్రస్తుతం ఆయన ఎక్కడుందీ..."

అతను నవ్వి ఊరుకొన్నాడు. జవాబివ్వలేదు.

శ్రీరంజని అతనివంక విడ్డూరంగా చూసింది. ఏమీ మాట్లాడకుండా అలా నవ్వుతాడేం మహానుభావుడు?

సర్వర్ బిల్ తీసుకొచ్చి టేబుల్ మీదుంచాడు. అతను పర్స్ తెరిచి అయిదురూపాయలనోటు బయటకు లాగి సర్వర్ కందించాడు.

"నేనిస్తాన్లెండి..." తన బాగ్ తీయబోతూ అంది శ్రీరంజని.

"నా దగ్గర బోలెడు డబ్బుంది లెండి!" తన పర్స్ ఆమెకు చూపుతూ అన్నదతను. శ్రీరంజని దృష్టి తక్షణ అతని పర్సుకి ఓ మూల ఉన్న అందమైన ఓ అమ్మాయి ఫొటోమీద పడింది. ఆమె గుండెలు ఝల్లుమన్నయ్.

"ఎవరా అమ్మాయ్? అతనికీ ఆ పిల్లకీ ఏమిటి సంబంధం! అలాంటి సంబంధం లేకపోతే ఏకాఏకిని అతని పర్స్‌లో ఎలా స్థానం సంపాదించుకొంది...మరి...మరి...."

"మీరేమీ అనుకోనంటే ఓ విషయం అడుగుతాను..." చిరునవ్వుతో అన్నాడతను.

శ్రీరంజని గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్.

ఏమడగబోతున్నాడు? అదే నా? తమ ప్రేమ సంగతేనా? తమ వివాహం సంగతేనా?...

"అడగండి..." సిగ్గుతో ముఖం ఎర్రబడిపోయింది.

"ఎంత ప్రయత్నిస్తున్నా మీరెవరో నాకు సరిగ్గా గుర్తురావటంలేదు. నో డౌట్! మిమ్మల్ని చూసినట్లూ, మీతో పరిచయం ఉన్నట్లూ స్పష్టంగా అనిపిస్తోంది.కాని...ఎక్కడ? ఎప్పుడు? అనేదే...ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి! నాది చాలా మతిమరపు స్వభావం." శ్రీరంజని తెల్లబోయింది. అతనివంక కళ్ళప్పగించి చూస్తూండిపోయింది

ఏమిటితను మాట్లాడేది? తనెవరో అతనికి గుర్తులేదా? ఇంతకంటె ఘోరం ఇంకేమయినా ఉంటుందా? మరి తన కతను ఎలా గుర్తున్నాడు? ఇంతకాలం తన మనసులో ఎలా రాజ్యం చేశేడు? అంటే...తన కతను ఒక్కడే గాని అతనికి తనలాంటివాళ్ళు చాలామంది అన్న మాట. అంచేత తనిప్పుడు అతనికి గుర్తులేదు. ఇటువంటి వాడినా చేసుకోవాలని తను ఉవ్విళ్ళూరుతోంది? అదృష్టం అని మురిసిపోతోంది?

దివాలున కుర్చీలోనుంచి లేచింది శ్రీరంజని.

"నేను గుర్తులేనందుకు చాలా సంతోషం. నేనెవర్నో చెప్పి మీకు అనవసరంగా పాత జ్ఞాపకాల్ని ముందుకి లాగటం నా కిష్టంలేదు. థాంక్ యూ..."

చరచరా హోటల్ బయటకు నడిచిందామె.

అతను త్వరత్వరగా ఆమెను వెంబడించబోయాడు.

"చూడండి మిస్...దయచేసి ఒక్క నిముషం నా మాట వినిపించుకోండి—హలో మిస్..."

శ్రీరంజని మరింత త్వరగా నడుస్తూ తులసివాళ్ళ సందులోకి తిరిగింది.

అతను సందు మొదట్లో ఆగిపోయాడు.

తులసివాళ్ళింటి ముందు నిలబడి తలుపు తట్టిందామె.

"వస్తున్నా..." అంటూ వినిపించింది తులసి గొంతు. మరుక్షణంలో తలుపు తెరచుకొంది.

"ఏమిటే ఇంత ప్రొద్దుపోయాకా వచ్చేది?" ఆశ్చర్యంగా అంది తులసి.

"ఇంకా ముందే వచ్చేదాన్ని. త్రోవలో పెద్ద ప్రమాదంలో ఇరుక్కోబోయి కొంచెంలో బ్రతికి బయటపడ్డాను..." నిట్టూరుస్తూ అంది శ్రీరంజని.

"అదృష్టవంతురాలివి..." కళ్ళు పెద్దవిచేసి అంది తులసి.

"అవును...చాలా అదృష్టవంతురాలిని..." గొణుక్కుంది శ్రీరంజని.